## క్లుప్తంగా

### దేవదాయ శాఖ సత్రం దుకాణాల వేలం

**తిరువూరు:** స్థానిక మండల పరిషత్ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రానికి అనుబంధంగా నిర్మించిన దుకాణ సముదాయం లీజు వేలాన్ని శుక్రవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 12 మంది టెండర్లు దాఖలు చేశారు. అత్యధికంగా గ్రౌండ్ ఫ్లోర్‌కు నెలకు రూ.2 లక్షల 20 వేలు, మొదటి అంతస్తుకు రూ.30 వేల చొప్పున వేసిన టెండర్లను దేవదాయశాఖ ఆమోదించింది. మూడేళ్ల కాలపరిమితికి దుకాణాలను అద్దెకు ఇవ్వనున్నట్లు గన్నవరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. వేలం నిర్వహణలో వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రం వంశపారంపర్య ధర్మకర్త దారా శ్రీనివాసరావు, తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### సామూహిక కుంకుమార్చన

**కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, లక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు కంచిభొట్ల సుబ్రహ్మణ్య శర్మ కళాశాల బాలికలతో అమ్మవారికి పూజలు చేయించారు. కళాశాల చైర్మన్ ఎంఎం మాలకొండయ్య, బాలకొండమ్మ దంపతులు, ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఎల్‌బీఆర్‌సీఈ అధ్యాపకునికి డాక్టరేట్

**మైలవరం:** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెషమెన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు ముస్నంగి రామిరెడ్డికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ లభించింది. ఈయన స్టాటిస్టిక్స్ విభాగంలో స్టడీ ఆఫ్ స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ చార్ట్స్ అండ్ రెలియబిలిటి టెస్ట్ ప్లాన్స్ అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో వస్తువుల నాణ్యతకు సంబంధించిన నియంత్రణ పరిమితులు, నాణ్యతను గుర్తించే ప్రణాళికను విశదీకరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఫ్రెషమెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ. రామిరెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు రామిరెడ్డిని అభినందించారు.

### మారెమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 7.89 లక్షలు

**పుట్రేల (విస్సన్నపేట):** పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. నాలుగు హుండీ కానుకలు లెక్కించగా 93 రోజులకు గాను రూ.7,89,761 వచ్చాయని ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. గన్నవరం దేవదాయ శాఖ తనిఖీదారు సుధాకర్ పర్యవేక్షించారు.

### ఘనంగా హిందీ దినోత్సవం

**జి.కొండూరు:** చెవుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందీ కవులు కబీర్ దాస్, తులసీదాస్, ప్రేమ్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, సంప్రదాయ కవుల వేషధారణ పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ కేఎస్‌జే లక్ష్మి బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయిని ఎస్. స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

**సీఐ కె. రామకృష్ణ**

**నూజివీడు:** నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో గణపతి నవరాత్రులు, వినాయక నిమజ్జనం సమయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు డీజేలు ఏర్పాటుచేసి అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి 8 గంటల కల్లా ఉత్సవాలను ముగించాలని సూచించారు. చెరువులు, వాగుల్లో క్రేన్‌ల సాయంతో నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొన వద్దని సూచించారు.

### వర్గీకరణను ఆపలేరు

**నూజివీడు:** ఎవరెన్ని కుట్రలు పన్నినా ఎస్సీ వర్గీకరణను ఆపలేరని మాదిగ సంఘాల ఐక్య వేదిక నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల లవకుమార్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వర్గీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ప్రాణత్యాగానికైనా సిద్ధమే అని స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు లాం దానియేలు, మల్లాది భాస్కరశర్మ, ముల్లంగి జమలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, నల్లమోతు కాంచనరావు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనులు

**ఎ.కొండూరు:** చీమలపాడు గ్రామంలో సర్పంచ్ మోర్ల లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పూడికతీత, చెత్త చెదారం తొలగింపు, తాగునీటి క్లోరినేషన్ పనులు చేశారు. బ్లీచింగ్ చల్లించారు.

● **చాట్రాయి:** మండలంలోని కొత్తగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లి, డ్రెయినేజీల్లో పూడిక తీశారు. సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణమే శాశ్వత పరిష్కారం

- వరద ప్రవాహానికి బుడమేరుపై ధ్వంసమైన లో లెవెల్ చప్టా
- రాకపోకలకు తాత్కాలికంగా దిక్కయిన పాత వంతెన
- హై లెవెల్ వంతెన నిర్మాణం చేయాలని ప్రజల విజ్ఞప్తి



బుడమేరుపై ప్రమాదకరంగా ఉన్న పాత వంతెన పైనే రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

**జి.కొండూరు:** హెచ్.ముత్యాలంపాడు-కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై పాత వంతెన శిథిలావస్థకు చేరింది. తాత్కాలికంగా చప్టా నిర్మించారు. ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి అది కూడా ధ్వంసమైంది. భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో కుంగిపోయిన పాత వంతెననే సరి చేసి తాత్కాలికంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలు మినహా ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలకు అవకాశం లేదు. ఏ క్షణాన్నైనా పాత వంతెన కూలే ప్రమాదం ఉంది. ఎక్కువ కాలం ఈ వంతెనపై రాకపోకలు కొనసాగించే వీలులేదు. హై లెవెల్ వంతెన నిర్మాణమే శాశ్వత పరిష్కారంగా కనిపిస్తోంది.

#### రూ. 55 లక్షలతో లో లెవెల్ చప్టా..

హెచ్. ముత్యాలంపాడు-కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి వరద ఉధృతికి గతంలో కుంగిపోయింది. గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు గత ఏడాది అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు నిత్యం ఇబ్బంది తలెత్తుతుండటంతో హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టి పూర్తయ్యే వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రూ.55 లక్షల ప్రభుత్వ నిధులతో లో లెవెల్ చప్టాను నిర్మించారు. దీనికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు సైతం మరో రూ.16 లక్షలు ఖర్చు చేశారు. బుడమేరు వరద ఉధృతికి కందులపాడు వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు గతంలో మూడుసార్లు కొట్టుకుపోయింది. మరలా ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి చప్టాకి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది.

#### ప్రధాన రహదారి ఇదే

తిరువూరు, మైలవరం నియోజకవర్గాలలోని ప్రజలు ఇబ్రహీంపట్నం మీదుగా విజయవాడ వెళ్తుంటారు. అదేవిధంగా జి.కొండూరు మండల పరిధిలోని ఆత్కూరు, హెచ్. ముత్యాలంపాడు నుంచి ఈ వంతెన మీదుగా కందులపాడు, వెలగలేరు మీదుగా విజయవాడ వెళ్తుంటారు. విజయవాడలో ముఖ్యమైన కార్యక్రమాలు జరిగే సమయంలో ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను సైతం ఇబ్రహీంపట్నం నుంచి ఈ రహదారి వైపు దారి మళ్లిస్తారు. ఈ క్రమంలో నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లో లెవెల్ చప్టాపై వర్షాలు పడిన సమయంలో, వరద ఉధృతి పెరిగిన సమయంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

#### ఒకరి తర్వాత ఒకరే వెళ్లాలి

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లో లెవెల్ చప్టా వెడల్పు కూడా లేకపోవడంతో భారీ వాహనాలు ఒక వాహనం వెనుక మరో వాహనం వెళ్లాల్సి వస్తోంది. ఒక వైపు వాహనాలు వెళ్లిన తర్వాతనే మరో వైపు వాహనాలు రావాల్సి వస్తోంది. ఒకేసారి ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో చప్టాకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోవడంతో పాటు చప్టా కూడా ప్రమాదకరంగా మారడంతో గత నెల 31 నుంచి భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

#### ప్రతిపాదనల దశలోనే..

బుడమేరుపై పాత వంతెన స్థానంలో నూతన హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టేందుకు అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు గతేడాది అధికారులు రూ.8.5 కోట్లకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికలు కూడా సమీపించడంతో వంతెన నిర్మాణం ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయింది. ఇప్పుడు కూడా ఎమ్మెల్యేగా వసంత వెంకట కృష్ణప్రసాదే ఉన్నందున ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన ఆయన వెంటనే వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

#### రాకపోకలకు ఇబ్బంది అవుతోంది



కందులపాడు వద్ద బుడమేరుపై హై లెవెల్ వంతెనను వెంటనే నిర్మించాలి. ఇటీవల నిర్మించిన లో లెవెల్ చప్టా కూడా ప్రమాదకరంగా ఉంది. చివరికి పాత వంతెనే దిక్కైంది. ఏ క్షణాన్నైనా పాత వంతెన కూలే అవకాశం ఉంది. తరచూ రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

– యర్రగుంట సుకుంద్, వెలగలేరు గ్రామం

#### ప్రమాదకరంగా ఉంది



వరద ప్రవాహం వల్ల కందులపాడు వద్ద బుడమేరుపై చప్టా ధ్వంసమైంది. పాత వంతెన మీదుగా రాకపోకలు జరుగుతున్నాయి. పాత వంతెన కూలిపోయే ప్రమాదం ఉంది. వంతెన కూలితే జరిగే నష్టాన్ని ఊహించలేం. చప్టాను పునరుద్ధరించి హై లెవెల్ వంతెనను వెంటనే నిర్మించాలి.

–మందా నోవా, వెల్లటూరు గ్రామం

### నూజివీడు టౌన్ సీఐగా సత్య శ్రీనివాస్

**నూజివీడు:** నూజివీడు టౌన్ సీఐగా పి.సత్య శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఇక్కడ రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంతో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తానని చెప్పారు. సీఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

### ఖరీఫ్ పంటల సాగుపై శిక్షణ

**తిరువూరు:** ఖరీఫ్ పంటల్లో సాగునీరు, కలుపు, ఎరువుల యాజమాన్యం సమగ్రంగా నిర్వహిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఎన్టీఆర్ జిల్లా రైతు శిక్షణా కేంద్ర డెప్యూటీ డైరెక్టర్ మాధవీలత అన్నారు. తిరువూరు మండలం కాకర్లలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల ఎరువులు, పురుగుమందులు వాడితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. మేలైన వ్యవసాయ పద్ధతుల గురించి లక్ష్మీపురంలో తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెన్నడీ, మండల వ్యవసాయాధికారి పద్మ రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.

### సీతారాం ఏచూరికి నివాళి

**నూజివీడు/ఆగిరిపల్లి:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నూజివీడు రూరల్ మండలం పల్లెర్లమూడిలో, ఆగిరిపల్లిలోని సీఐటీయూ మండల కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, నాయకులు మాట్లాడారు. అలాగే సీపీఎం నాయకులు పాతూరి వెంకటేశ్వరరావు 18వ వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లి సుందరయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

**జి.కొండూరు:** మైలవరం నియోజకవర్గంలో ఇటీవల వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందిన పలువురు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శుక్రవారం అందజేశారు. రెడ్డిగూడెం మండల పరిధి కుదప శివారు భవానీపురం గ్రామానికి చెందిన మృతుడు కొనరాజు వెంకటేశ్వరరావు కుటుంబానికి, మైలవరం మండల పరిధి వెల్వడం గ్రామానికి చెందిన మృతుడు శెట్టిపల్లి కృష్ణారెడ్డి కుటుంబానికి, అనంతవరానికి చెందిన మృతుడు తుపాకుల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు, జి.కొండూరు మండల పరిధి హెచ్. ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మృతురాలు గొర్రె శివపార్వతి కుటుంబ సభ్యులకు, ఇదే గ్రామానికి చెందిన మృతుడు చల్లా మోహనకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.



హెచ్. ముత్యాలంపాడులో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

## క్రీడలతో మానసికోల్లాసం

**ముసునూరు:** క్రీడలతో దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు హైస్కూల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జి మహ్మద్ ఆలీ ఖాన్ ఆధ్వర్యంలో హెచ్ఎం సునీల అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులను సర్పంచ్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన 250 మంది విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా పోటీలు నిర్వహించారు. ఎస్ఎంసీ సభ్యులు, పీడీలు హేమ, సుకుమార్, వాకా నాగరాజు, నాగమల్లేశ్వరి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముసునూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ తదితరులు

## వరద బాధితులకు సాయం

**మైలవరం:** మైలవరం ఆరో వార్డు ఎల్ఎఫ్ఎల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ దంపతులు వరద బాధితుల సహాయార్థం రూ.20 వేలు చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి శుక్రవారం అందజేశారు. ఈమేరకు వెల్వడం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు చెక్‌ను అందజేశారు.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కాలుష్య నియంత్రణ పోరాట సమితి ఆధ్వర్యంలో మూలపాడు, కొండపల్లి ప్రాంతాల్లో వరద ముంపు బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు బాలకృష్ణ, కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు భవానీ, హైదర్, మాధురి, భద్ర, స్వాతి, నాగరాజు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేసిన సమితి సభ్యులు

### ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

**నూజివీడు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నూజివీడు మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నిర్వహించారు. కబడ్డీ కోర్టును కౌన్సిలర్ కందుల సత్యనారాయణ, ఖోఖో కోర్టును స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మీ, వాలీబాల్ కోర్టును ఇన్‌చార్జి హెచ్ఎం వల్లభనేని పద్మ ప్రారంభించారు. బాలుర విభాగంలో అండర్-14, -17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు జరిగాయి. పోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహభరితంగా జరిగాయి. పీడీలు లక్ష్మి, వనజ, రాణి, స్వప్న, రాజేంద్రప్రసాద్, ఆరతి, నాగేశ్వరరావు, రాజేశ్వరి, నాగమణి, రవీంద్ర, రాజ్‌కుమార్, పుల్లారావు, ఆదర్శ్ బాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**తిరువూరు:** పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు సమగ్ర పౌష్టికాహారం తీసుకోవాలని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి అన్నారు. శుక్రవారం స్థానిక పాత తిరువూరు పొలిమేర డొంక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాల్లో ఎక్కువగా పోషక విలువలుంటాయని, గర్భిణులు వీటిని తప్పక తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులైన బిడ్డలు పుడతారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



విస్సన్నపేట రెడ్డిగూడెం రోడ్డు ఇందిరానగర్ వద్ద అన్నసమారాధన



తిరువూరు రాజుపేటలో హనుమాన్ చాలీసా పారాయణం

**తిరువూరు/విస్సన్నపేట:** గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఏడో రోజుకు చేరాయి. గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. తిరువూరు రాజుపేట పాత ఏడీబీ సెంటర్‌లోని విఘ్నేశ్వర నవరాత్రి వేడుకల్లో మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

### నేడు ఉద్యోగుల సహకార సొసైటీ సమావేశం

**గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సొసైటీ సర్వసభ్య సమావేశం గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు అడ్డాల సుబ్బరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి జరిగే సమావేశానికి సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

### నిత్యావసర కిట్ల పంపిణీ

**చంద్రాల(మైలవరం):** చంద్రాల, మైలవరం గ్రామాలలో వరద బాధితులకు నిత్యావసర వస్తువుల కిట్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని చెప్పారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఏఏఎంటీకే దర్బార్‌లో అన్నదానం

**ఎ.కొండూరు:** మొహమ్మద్ జగత్ ప్రవక్త వారి జన్మదిన వేడుకల సందర్భంగా చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి శుక్రవారం తెలిపారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనాలని కోరారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

**నూజివీడు:** మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాయస్థానాల భవనం ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ తెలిపారు. అన్ని కోర్టుల నుంచి సివిల్, పరిష్కరించదగిన క్రిమినల్ కేసులను ఇందులో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**చాట్రాయి:** నులి పురుగుల నివారణతో రక్తహీనతను అరికట్టవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 17న నులి పురుగుల నివారణకు ఒక సంవత్సరం వయస్సు నుంచి 19 సంవత్సరాల వయస్సుగల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని విజయలక్ష్మి సూచించారు. ఈ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు. వైద్యులు శ్రీనివాసరెడ్డి, హెచ్ఈఓ శ్రీధర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**నూజివీడు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో పట్టణంలోని త్రివిధ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 18 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. చెస్ విభాగంలో.. అమిత్‌శామ్యూల్ (7వ తరగతి), కె.వంశీ (9వ తరగతి), వెంకట రామ సాయి (10వ తరగతి), లియో (10వ తరగతి), కబడ్డీలో.. తేజ, హేమ్‌చంద్ (10వ తరగతి) షటిల్‌లో.. సాయి మనీష్, జై దుర్గాప్రసాద్, కౌశిక్ (10వ తరగతి) ఖోఖోలో.. నవతేజ, అభినవ్ (8వ తరగతి), హేమంత్ (9వ తరగతి), వాలీబాల్‌లో.. షేక్ సుభాని (9వ తరగతి), వంశీ, షఫీ (10వ తరగతి), పవన్ తేజ్ (9వ తరగతి), యోగాలో.. రాజా (9వ తరగతి) ఎంపికయ్యారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**

**వెల్వడం(మైలవరం):** దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వెల్వడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురిజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోడూరు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరంలో గుండె, ఫిట్స్, వెన్నెముక సమస్యలు, తలనొప్పి, బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ట్రస్టు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వెల్వడం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా 35 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మహిళలను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పసుపు, కుంకుమ, చీరెలు, జాకెట్ ముక్కలు, గాజులు, పండ్లు అందజేశారు.



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

## ఇంటి తాళాలు పగులకొట్టి నగలు చోరీ

**విస్సన్నపేట:** స్థానిక ఎస్సీ వాడలో ఇంటి తాళాలు పగులకొట్టి నగలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ వాడకు చెందిన పల్లెపోగు లక్ష్మయ్య తన కుమార్తె ప్రసవానికి ఈ నెల 3వ తేదీన ఇంటికి తాళాలు వేసి నల్లగొండ వెళ్లారు. తిరిగి ఈనెల 12వ తేదీన ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులకొట్టి బీరువా తీసి ఉంది. బీరువాలోని 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ. 30 వేలు నగదు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గిరిబాబు, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చోరీ జరిగిన ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

## జానపదాలు మన వారసత్వ సంపద

**లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి**

**మైలవరం:** జానపద కళారూపాలు మనందరి వారసత్వ సంపద అని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తరతరాల తెలుగువారి సంపద.. జానపద కళారూపాలు అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం నిర్వహించారు. 82 మంది పరిశోధకులు తమ పరిశోధన కాపీలు సమర్పించగా అంతర్జాతీయ జర్నల్‌లో కళాశాల ప్రచురించింది. ఆత్మీయ అతిథి ఇతియోపియాలోని బ్లూ హోరా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.విక్టర్‌బాబు మాట్లాడుతూ ఆఫ్రికా ఖండంలో ఉన్న జానపద కళారూపాలు, ఆసియా ఖండంలో ఉన్న జానపద కళారూపాల సారూప్యం, వైవిధ్యాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. డాక్టర్ ప్రత్తిపాటి మాధ్యూ, డాక్టర్ పి. సుబ్బారావు, డాక్టర్ మేకా రామస్వామి, డాక్టర్ జీబీ ఆనంద్ కుమార్, డాక్టర్ ఎం. దేవానంద్, డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యాంసులు పాల్గొన్నారు.

### కరెన్సీ గణపతి

**మైలవరం:** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మైలవరం కోట వెనుక శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి చలువ పందిట్లో గణపతిని శుక్రవారం రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో భక్తులు అలంకరించారు. రూ.500 నోట్లు, రూ.100, రూ.20 నోట్లతో అందంగా అలంకరించి పూజలు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

